సాక్షి రంగారెడ్డి

శనివారం । 18 । మార్చి । 2023



జీర్ణోద్ధరణ అభినందనీయం

ఆలయాల జీర్ణోద్ధరణకు చర్యలు చేపడుతుండటం అభినందనీయమని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 10లో▸



కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

వడగండ్లు కడగండ్లు మిగిల్చాయి. తీవ్ర పంట, ఆస్తి నష్టం జరగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. 10లో▸



ఊసేలేని 'యంత్రలక్ష్మి'

ఐదేళ్లుగా యంత్రలక్ష్మి పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా స్పందించడం లేదు. 10లో▸

న్యూస్‌రీల్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా



ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: పేపర్ లీకేజీకి కారణమైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సెక్రెటరీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకొని కార్యాలయం ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. బోర్డు చైర్మన్ దగ్గర నుంచి మంత్రుల స్థాయిలో హస్తం ఉందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల విశ్వసనీయతను కోల్పోయిందన్నారు. పేపర్ లీక్ పెద్ద స్కాం అని.. చైర్మన్, సెక్రెటరీలు తెలిసే తతంగం నడిపించారన్నారు. మూడో వ్యక్తికి పాస్‌వర్డ్ ఎలా తెలుసని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయిచరణ్, వంగ సంజీవరెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆందోళనకారులను ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి, అనంతరం సొంత పూచీకత్తుతో విడిచిపెట్టారు.

ప్రశ్నించే గొంతులను నొక్కడం అన్యాయం

షాబాద్: బీఎస్పీ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ, రాష్ట్ర కో–ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా నిరాహార దీక్ష చేస్తున్న బీఎస్పీ కార్యకర్తలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమైన చర్యగా అభివర్ణించారు. ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కడం, అరెస్టులు చేయడం సరికాదని అన్నారు. నిరాహార దీక్షలు లేకుండా తెలంగాణను సాధించుకోగలిగేవాళ్లమా అని కేసీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఉద్యమాలను అణిచివేయడం, మేధావులను మాట్లాడకుండా నోళ్లు నొక్కివేయడం తగదన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగవుతాయని, ఉద్యోగాలు వస్తాయని కలలు కంటే అవన్నీ కల్లలయ్యాయన్నారు. అరెస్టయిన వారందరినీ భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కోపల్లి ఫార్మా యాజమాన్యంపై కేసు



పరిశ్రమ ఆవరణలో రసాయన డ్రమ్ములు

జీడిమెట్ల: కోపల్లి ఫార్మా పరిశ్రమ అవరణలో జరిగిన భారీ అగ్నిప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని అధికారులు నిర్ధారించారు. నిబంధనలు పాటించకుండా రసాయనాలు బహిరంగంగా వదిలివేసినందునే ప్రమాదం చోటు చేసుకుందన్నారు. శుక్రవారం సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే వివేకానంద, బీఆర్‌ఎస్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డి సందర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్న ఎమ్మెల్యే పోలీసు, పీసీబీ అధికారులతో మాట్లాడారు. పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రసాయనాలను తరలించాలి

కోపల్లి పరిశ్రమ ఆవరణలో ఉన్న రసాయనాలను డ్రమ్ములతో సహా మూడు రోజుల్లో రాంకీకి తరలించాలని పీసీబీ అధికారి రాజేందర్ పరిశ్రమ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

పలు సెక్షన్లపై కేసులు

నిర్లక్ష్యంగా రసాయనాలు వదిలివేసినందుకు పరిశ్రమ యజమానిపై 336, 285, 286 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

కోలుకుంటున్న కానిస్టేబుల్ రవి కుటుంబసభ్యులు

రాంగోపాల్‌పేట: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో అస్వస్థతకు గురైన కానిస్టేబుల్ రవి కుటుంబసభ్యు లు యశోద ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. తుకారంగేట్ ఠాణాలో విధులు నిర్వహిస్తున్న రవి తండ్రి జంగయ్య స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గార్డెనర్‌గా పనిచేస్తూ, ఎనిమిదో అంతస్తులో కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రమాద సమయంలో కుటుంబసభ్యులను కాపాడేందుకు వెళ్లిన కానిస్టేబుల్ రవితో పాటు ఇంట్లో ఉన్న అతడి తల్లిదండ్రులు జంగయ్య, భారతమ్మ, సోదరుడు రాజు అస్వస్థతకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది వారిని రక్షించి ఆస్పత్రికి తరలించారు.

ఎదురు దెబ్బ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- పీఆర్‌టీయూ కొంపముంచిన రెబల్ అభ్యర్థి
- 1,169 ఓట్ల తేడాతో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గెలుపు
- నమ్మకాన్ని నిలబెట్టుకుంటానంటున్న ఏవీఎన్ రెడ్డి



ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణపత్రం అందుకుంటున్న ఏవీఎన్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూకి ఓటర్లు షాక్ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓటింగ్‌లోనే కాదు, రెండో ప్రాధాన్యత ఓటింగ్‌లోనూ పీఆర్‌టీయూ అభ్యర్థులను కాదని.. బీజేపీ బలపర్చిన అయ్యాలపు వెంకటనారాయణరెడ్డికి పట్టం కట్టా రు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు ఆధిక్యతను కొనసాగిస్తూ వచ్చిన ఏవీఎన్‌రెడ్డి 21వ రౌండ్ ముగిసే సరికి సమీప ప్రత్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిపై 1,169 ఓట్ల తేడాతో విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆయనకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని.. ఈ గెలుపు తనపై బాధ్యతను మరింత పెంచిందని.. మండలి వేదికగా ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏవీఎన్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి గెలుపు.. ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్లు పంచి, బాణసంచా కాల్చారు.

రెండుగా చీలి.. ఓడి

ఉపాధ్యాయ సంఘాల్లో పీఆర్‌టీయూ బలమైన సంఘం. అత్యధిక సభ్యత్వం ఉన్న ఈ సంఘం మొదటి నుంచీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ఆ ప్రభుత్వానికి అనుబంధంగా వ్యవహరిస్తూ వస్తోంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఈ సంఘం అభ్యర్థులే గెలుపొందారు. తాజాగా ఈ సంఘం రెండుగా చీలిపోయింది. మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి టీపీఆర్‌టీయూ నుంచి పోటీ చేయగా, ఉద్యోగ సంఘం నేతగా గుర్తింపు పొందిన గుర్రం చెన్నకేశవ రెడ్డి పీఆర్‌టీయూటీఎస్ నుంచి పోటీ చేశారు. సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులు చెన్నకేశవరెడ్డికి మద్దతుగా నిలిచారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పని చేసినందున పోటీ నుంచి ఉపసంహరించుకోవాలని కాటేపల్లిని కోరారు. అయినా ఆయన పోటీకే సిద్ధమయ్యారు. ఇలా ఒకే సంఘం నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో నిలవడం కొంప ముంచింది. ముందు నుంచి అంతా భావించినట్లే చెన్నకేశవరెడ్డి ఎన్నికల్లో గట్టిపోటీ ఇచ్చారు. రెండు సార్లు ఎమ్మెల్సీగా గెలుపొందిన కాటేపల్లి ఈసారి ఘోరపరాభవాన్ని చవిచూడాల్సి వచ్చింది. పీఆర్‌టీయూ ఓటమికి ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉండటం ఒక కారణమైతే.. జీఓ నంబర్ 317, స్పౌజ్ కేసుల బదిలీలు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు, ఖాళీల భర్తీ వంటి అంశాలు మరో కారణమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

వారికి చుక్కెదురు

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి ఖాతాలో పడతాయని అంతా భావించారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందే అవకాశం ఉన్నట్లు ఆశించారు. కానీ అనూహ్యంగా ఓటర్లు యూటీఎఫ్‌ను సైతం తిరస్కరించారు. అధికార బీఆర్‌ఎస్‌తో చెలిమి ఆ సంఘానికి ప్రతికూల ఓటు పడేలా చేసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ స్వయంగా ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల బరిలో అభ్యర్థిని నిలబెట్టినా..ఆయన్ను కూడా ఓటర్లు నమ్మలేదు. ఆశించిన స్థాయిలో ఓట్లు పడకపోవడమే ఇందుకు నిదర్శనం.

పోటాపోటీగా ఆందోళనలు

హుడాకాంప్లెక్స్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి డబ్బులు పంచడంతో గెలిచాడని పీఆర్‌టీయూ నాయకులు ఆరోపించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం తెల్లవారుజామున లెక్కింపు సమయంలో కొంత ఆందోళన చోటు చేసుకుంది. డబ్బులిచ్చి ఓట్లు వేయించుకున్నారని పీఆర్‌టీయూ నేతలు ఆరోపించడంతో ఏవీఎన్ రెడ్డి వర్గం వారు ఆందోళనకు దిగారు. ఇరు వర్గాలు నినాదాలు చేయడంతో కొంత ఉద్రిక్తత



కౌంటింగ్ కేంద్రం వద్ద ఆందోళనకు దిగిన ఇరు వర్గాలు

చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎక్కడ వారిని అక్కడ చెదరగొట్టారు.



మొండిగౌరెల్లిలో నష్టపోయిన పుదీనా పంటను పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

పేదల గోస పట్టదా?

- వడగళ్ల బాధితులను ఆదుకోవాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

యాచారం: వడగళ్లు కురిసి.. పేదలు నిరాశ్రాయులుగా మారి.. తిండి లేకుండా గోసపడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మంతన్‌గౌరెల్లిలో శుక్రవారం పర్యటించిన ఆయన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వడగళ్లు కురిసి 450కిపైగా ఇళ్ల రేకుల దెబ్బతిని, ఇంట్లో ఉన్న వస్తువులు, సరుకులు పూర్తిగా తడిసిపోయాయని అన్నారు. వెంటనే గ్రామంలో క్యాంపులు ఏర్పాటు చేసి బాధితులకు భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు ధ్వంసమైన పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని, పంటలకు ఎకరాకు రూ.50 వేలకు మించి పరిహారం అందజేయాలని కోరారు. మొండిగౌరెల్లిలో వంద మందికిపైగా రైతులు పుదీన పంటనే సాగు చేసి జీవనోపాధి పొందుతారని, వడగళ్లు కురిసి పంట పూర్తిగా దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ హరీశ్‌తో ఫోన్‌లో మాట్లాడి వడగళ్లతో నష్టపోయిన తీరును వివరించారు. కార్యక్రమంలో యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొరెడ్డి అర్జున్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, నాయకులు నక్క శ్రీనివాస్ యాదవ్, గొల్లపల్లి శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు యాదవ్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు శైలజ, గణేశ్ నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో అరుదైన రోబోటిక్ సర్జరీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో 60 ఏళ్ల మహిళా రోగికి రోబోటిక్ థైమెక్టమీ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. మస్తెనియా గ్రావిస్ అనే నాడీ సంబంధిత సమస్యతో బాధపడుతూ ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్న రోగికి ఈ రోబోటిక్ ప్రక్రియను నిర్వహించామన్నారు. దీనికి కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రదీప్ రాచకొండ సారథ్యం వహించినట్లు ఆసుపత్రి ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సమస్యకు సంప్రదాయ శస్త్రచికిత్సలో స్టెర్నమ్ (రొమ్ము–ఎముక) విచ్ఛిన్నం చేయాల్సి ఉంటుందని, అయితే రోబోటిక్ విధానంతో తక్కువ గాయం కావడంతో రోగి వేగంగా కోలుకున్నట్లు వారు వివరించారు.





పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

మొయినాబాద్: రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీబీ చైర్మన్ బి.మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సురంగల్–మొయినాబాద్ పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు పంటరుణాలతోపాటు దీర్ఘకాలిక రుణాలను అందజేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తున్నామన్నారు. మొయినాబాద్‌లో పీఏసీఎస్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో చాలాకాలంగా అద్దెభవనంలో కొనసాగుతోందని.. సొంత భవన నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, వైస్ చైర్మన్ మహేందర్, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవరెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, భూ పాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, సర్పంచ్‌లు స్వరూప, నరోత్తంరెడ్డి, సీఈఓ మనోహర్‌రెడ్డి, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆయుష్మాన్'భవ

- రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు
- తెల్లరేషన్ కార్డు కలిగినవారు అర్హులు
- ఈ నెల 31వ తేదీతో ముగియనున్న గడువు
- నమోదుకు ప్రత్యేక కేంద్రాలు
- అందుబాటులో ఆరోగ్యమిత్ర, ఆరోగ్య సిబ్బంది

షాబాద్: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కింద తెల్లరేషన్ కార్డు (ఫుడ్ సెక్యూరిటీ కార్డు) కలిగిన వారికి రూ.5లక్షల వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కింద రూ.2లక్షలు వరకు వైద్య ఖర్చులు చెల్లించేవారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ విలీనంతో ఆదనంగా రూ.3లక్షలు వరకు లాభం చేకూరనుంది. ఈ మేరకు జిల్లాలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు.

అనుసంధాన విధానం..

- కొత్త రేషన్ కార్డు నంబర్‌తో ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేస్తారు. ఆధార్‌కార్డు, గతంలో రేషన్ కార్డుకు అనుసంధానం చేసిన సెల్‌ఫోన్ నంబర్‌కు చెబితే ఓటీపీ ద్వారా పొందుపరుస్తారు.
- ఆయుష్మాన్ కార్డులు ఏప్రిల్‌లో అందించనున్నారు. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా ఆయుష్మాన్ భారత్ సేవలు పొందొచ్చు.
- ఈ కార్డుతో 1,886 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారు. ప్రధానంగా మోకాలి చిప్ప మార్పిడి, కిడ్నీ, గుండె మార్పిడి వంటి రుగ్మతలకు శస్త్ర చికిత్సలు చేయించుకునే వీలుంది.

కుటుంబంలో ప్రతి ఒక్కరికీ కార్డు..

- దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉచిత వైద్య సేవలు పొందేలా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యశ్రీ కార్డును రూపొందించారు.
- కుటుంబంలో ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా ప్రత్యేక కార్డులు అందజేస్తారు.
- ఈ నెల 31 వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది.
- ప్రత్యేక కేంద్రం వద్ద ఆరోగ్య మిత్ర, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- శిబిరానికి వెళ్తే ఫొటో తీసుకొని వివరాలు నమోదు చేసుకుంటారు.
- జిల్లాలో మొత్తం 1,44,309 మందికి 1,07,764 మంది నమోదు చేసుకున్నారు. ఇంకా 36,545 మంది నమోదు చేసుకోవాల్సి ఉంది.



షాబాద్ మండలం ముద్దెంగూడలో ఆయుష్మాన్ భారత్ వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

సద్వినియోగం చేసుకోవాలి



రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులు. ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ ఉన్న ఆస్పత్రుల్లో లేదా సీఎస్‌సీ కేంద్రాల్లో ఉచితంగా నమోదు చేస్తారు. ఈ నెల 31 వరకు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకుని ఆయుష్మాన్ భారత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్‌సీ జిల్లా మేనేజర్

అవగాహన కల్పించాలి..



కేంద్రం దేశంలోని నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. ప్రచారలోపంతో క్షేత్ర స్థాయిలో వాటి ఫలాలు అందడంలేదు. అధికారులు గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ నమోదుకు శిబిరాలు ఏర్పాటు చేసి తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి అవగాహన కల్పించాలి.

– మహేందర్, యువమోర్చా జిల్లా కార్యదర్శి

నో సేఫ్టీ @ స్వప్నలోక్

కాంప్లెక్స్‌లో కనీస భద్రతా చర్యలు కరువు

- సైరన్ మోగి ఉంటే ప్రమాదం తప్పేది!
- సాధారణ వేళల్లో జరిగే ఉదంతాల్లో మృతులు అరుదు
- ఈ ప్రమాదంలో ఆరుగురు బలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్యంత పురాతనమైన స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అవసరమైన స్థాయిలో ఫైర్ సేఫ్టీ మెజర్స్ లేవు. కొద్దోగొప్పో ఉన్నవి కూడా పని చేయకుండా నామ్ కే వాస్తేగా మారాయి. అత్యాధునిక, అత్యంత ఖరీదైన ఉపకరణాల మాట అటుంచితే కనీసం ఓ సైరన్ ఉన్నా విలువైన ఆరు ప్రాణాలు దక్కేవని అధికారులు చెబుతున్నారు.

ఆ వేళల్లోనే ప్రాణనష్టానికి ఆస్కారం

ఉస్మాన్‌గంజ్ కార్తికేయ లాడ్జ్, బోయగూడలోని స్క్రాప్ దుకాణంలో, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రూబీ లాడ్జిలాంటి అనేక ప్రమాదాల్లో భారీ ప్రాణనష్టం నమోదైంది. ఇవన్నీ అర్ధరాత్రి లేదా తెల్లవారుజాముల్లోనే చోటు చేసుకున్నాయి. ఆయా సమయాల్లో వాటిలో ఉండే కస్టమర్లు, కార్మికులు నిద్రలో ఉంటారు. ఫలితంగా అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని అప్రమత్తం కావడానికి, చేయడానికి ఆస్కారం ఉండదు. ఈ కారణంగానే అనేక మంది నిద్రలోనే తుదిశ్వాస విడుస్తుండటంతో మృతుల సంఖ్య పెరగడం జరుగుతుంది.

స్వప్నలోక్‌లో ఆ సమయం కాకపోయినా..

ఈ సమయాల్లో కాకుండా ఉదయం పూట, పని వేళలతో పాటు సాధారణ సమయాల్లోనూ సిటీలో అగ్నిప్రమాదాలు జరిగాయి. సోమాజీగూడలోని పార్క్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోనూ 2011లో పట్టపగలు భారీ ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. అప్రమత్తమైన అధికారులు దాదాపు 50 మందిని రెస్క్యూ చేయగలిగారు. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోనూ గురువారం రాత్రి 7.15 గంటలకే మంటలు రేగాయి. ఈ విషయం కొందరు దుకాణదారులు గుర్తించి బయటకు వచ్చేశారు. దీనిపై అప్రమత్తం చేయడానికి ఫైర్ అలెర్ట్ సైరన్, అలారం ఉండి, ప్రతి ఫ్లోర్‌లోను స్విచ్‌లు ఏర్పాటు చేస్తే పరిస్థితి వేరుగా ఉండేది. పొగలు చుట్టుముట్టక ముందే ఆ ఆరుగురూ కూడా బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకోవడానికి ఆస్కారం ఉండేది.

నోటీసులు సమాధానమూ ఇవ్వలేదు

సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లోని డెక్కన్ మాల్‌లో ఈ ఏడాది జనవరిలో జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్, భారీ భవనాల్లో అగ్నిమాపక, జీహెచ్‌ఎంసీ బృందాలు తనిఖీలకు ఉపక్రమించాయి. వీటిలో భాగంగా స్వప్నలోక్‌నూ సందర్శించిన టీమ్స్ భద్రతా లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశాయి. వాటిని సరి చేయడంపై అసోసియేషన్ అవసరమైన స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో ఈ ప్రమాదం జరిగిన ఆరుగురు యువత అశువులు బాశారు. ఈ కాంప్లెక్స్‌కు నోటీసులు ఇచ్చిన అధికారులు సైతం పరిస్థితుల్లో ఏదైనా మార్పు వచ్చిందా? లేదా? అన్నది పట్టించుకోలేదు.

ఉద్రిక్తత మధ్య పోస్టుమార్టం

- గాంధీ ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన
- మంత్రుల సందర్శన.. రూ.5 లక్షలు నష్టపరిహారం
- ప్రత్యేక అంబులెన్స్‌ల్లో స్వస్థలాలకు మృతదేహాలు

గాంధీఆస్పత్రి: స్వప్నలోక్ కాంప్లెక్స్ ప్రమాద ఘటనలో మృతిచెందిన వారి బంధువులు, తల్లిదండ్రుల ఆందోళనలతో గాంధీ మార్చురీ వద్ద శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఇక్కడికి తరలించగా..బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. బాధితులు హృదయవిదారక ఆక్రందనలు చూపరుల కంట కన్నీరు పెట్టించాయి. ఈ నేపథ్యంలో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో భారీస్థాయిలో మోహరించిన పోలీసులు మీడియాకు అనుమతించలేదు. మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, మహమూద్ అలీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి గాంధీమార్చురీ వద్ద మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. ఈ క్రమంలో క్యూనెట్ సంస్థ తమ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుకుందని, తక్షణమే సంస్థ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్, బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు వారికి జత కలిశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామాలకు తరలించారు.

స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను సీజ్ చేస్తాం

స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను సీజ్ చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. గాంధీమార్చురీ వద్ద మీడియాతో మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణకు సరైన జాగ్రత్తలు పాటించని గోడౌన్లు, భవన యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారని అన్నారు.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు



మంతన్‌గౌరెల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి



తమను ఆదుకోవాలని ఆందోళనకు దిగిన బాధితులు

- భారీగా ఆస్తి, పంట నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు
- తక్షణం పది కిలోల చొప్పున బియ్యం అందిస్తాం: మంచిరెడ్డి

యాచారం: వడగండ్లు కడగండ్లు మిగిల్చాయి. తీవ్ర పంట, ఆస్తి నష్టం జరగడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సుమారు ఐదు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మంతన్‌గౌరెల్లి, మొండిగౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో 500 రేకుల ఇళ్లకు రంధ్రాలు పడి పూర్తిగా ధ్వంసమయ్యాయి. కేవలం మంతన్‌గౌరెల్లి గ్రామంలోనే 450 రేకుల ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పదిమంది రైతులకు చెందిన పౌల్ట్రీఫాంలలో 60 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. వర్షపు నీరు ఇళ్లలోకి చేరి విలువైన వస్తువులు, దుస్తులు, ఇతర సామగ్రి తడిసి ముద్దయ్యాయి. కిలో బరువు ఉన్న వడగళ్లు పడటంతో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే.. ఐదువేల ఎకరాలకుపైగా వరి పంట, పలు కూరగాయలు, పండ్లతోటలు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.25 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచానా వేశారు.

ఆందోళన చెందవద్దు

బాధితులు ఆందోళన చెందవద్దని, అందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన మంతన్‌గౌరెల్లిలో పర్యటించారు. దెబ్బతిన్న రేకుల ఇళ్లను పరిశీలించారు. తీవ్ర గాయాలైన వృద్ధులను పరామర్శించారు. గింజలు రాలిన వరి పంటను పరిశీలించారు. 24 గంటల్లోనే సమగ్ర సర్వే చేసి తనకు నివేదిక ఇవ్వాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ హరీశ్‌తో ఎమ్మెల్యే మంచిరెడ్డి ఫోనులో మాట్లాడారు. నిరాశ్రయులుగా మారిన పేదలకు పది కిలోల చొప్పున రేషన్ బియ్యం, నగదు అందజేసే విధంగా కృషి చేయాలని కోరారు.

మంతన్‌గౌరెల్లిలో బాధితుల ఆందోళన

మంతన్‌గౌరెల్లిలో ఎమ్మెల్యే మంచిరెడ్డి పర్యటించే సమయంలో ప్రధాన చౌరాస్తాలో వడగళ్ల బాధితులు ఆందోళనకు దిగారు. తమను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళనతో తోపులాట జరిగింది. 'మిమ్మల్ని ఆదుకోవడానికే గ్రామానికి వచ్చా.. మీ సమస్యలు తెలియజేయండి.. అన్ని విధాలుగా ఆదుకుంటాం.. ఆందోళన చేస్తే ఎలా' అని నచ్చజెప్పారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

రైతులను ఆదుకుంటాం

మంచాల: వర్షాలకు పంట పాడై నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బోడకొండ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వడగండ్ల వానతో బోడకొండ నుంచి లోయపల్లి వరకు పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు వెంటనే పంటనష్ట వివరాలను సేకరించాలన్నారు. అధికారులు నివేదిక ఆధారంగా ప్రతీ రైతుకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హయత్‌నగర్: విద్యుదాఘాతానికి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలో నివాసం ఉంటున్న దేవిడి నరేందర్‌రెడ్డి(50) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఆకుల ఈశ్వర్ పస్మాములలోని అతన్‌భాయి ఫాంహౌస్‌లోని చేపల చెరువు వద్ద పని ఉందని తీసుకెళ్లాడు. పని చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి నరేందర్‌రెడ్డి కుప్పకూలి పోయాడు. చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కడ్తాల్: ప్రమాదవశాత్తు కిందపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందాడు. కడ్తాల్ సమీపంలోని శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై, ఎస్ఎల్ఆర్ గార్డెన్ సమీపంలో, ఈ నెల 5న గుర్తు తెలియని వృద్ధుడు ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బాధితుడిని గమనించి, అదే రాత్రి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాళ్లకు, ముఖానికి తగిలిన గాయాలతో కోలుకోలేక, గురువారం అర్ధరాత్రి, ఆస్పత్రిలోనే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల జీర్ణోద్ధరణ అభినందనీయం



పెద్దమంగళారంలో దేవాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

- ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పెద్దమంగళారంలో దేవాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ
- కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సినీనటుడు సుమన్



భూమి పూజలో పాల్గొన్న ప్రముఖ సినీనటుడు సుమన్

మొయినాబాద్: గ్రామాల్లో ఆలయాల జీర్ణోద్ధరణకు చర్యలు చేపడుతుండటం అభినందనీయమని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో ఆల్ ఇండియా పురాతన దేవాలయ పునర్నిర్మాణ ట్రస్ట్, గ్రామస్తుల సహకారంతో శిథిలావస్థకు చేరిన సుమారు 200 ఏళ్ల నాటి కుచనపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ప్రముఖ సినీ హీరో సుమన్ తదితరులు వేర్వేరుగా వచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో దేవాలయాలు ఉంటేనే ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందన్నారు. శిథిలావస్థకు చేరిన వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించేందుకు ముందుకొచ్చిన ఆల్ ఇండియా పురాతన దేవాలయ పునర్నిర్మాణ ట్రస్ట్, గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పురాతన దేవాలయాలను పునర్నిర్మించేందుకు ఆధ్యాత్మిక వేత్తలు, యువత ముందుకు రావాలన్నారు. యువతలో భక్తిభావం పెరగాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరోత్తంరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఆర్‌కే జైన్, జెడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీలు కొంపల్లి అనంతరెడ్డి, కంజర్ల భాస్కర్, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్, మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్, నాయకులు కొత్త నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, జయవంత్, ఆంధ్రూ, జైపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, హన్మంత్‌యా దవ్, కృష్ణారెడ్డి, రవూఫ్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీహరి, దప్పురాజు, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఊసేలేని 'యంత్ర లక్ష్మి'

- ఐదేళ్లుగా నిలిచిన వ్యవసాయ పరికరాల పంపిణీ
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- అన్నింటికీ కూలీలపైనే ఆధారం



మరియాపురంలో కలుపు తీస్తున్న కూలీలు

షాబాద్: రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు ద్వారా ఎకరాలకు ఏడాదికి రూ. 10వేలు అందిస్తూనే మరో వైపు అన్నదాతల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోంది. ఐదేళ్లుగా యంత్రలక్ష్మి పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా స్పందించడం లేదు. దీంతో రైతులు పొలం పనులకు కూలీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. 2017-18 ఆర్థిక సంవత్సరం వరకు యంత్రలక్ష్మి పథకం సజావుగా సాగింది. తదనాంతరం ఈ పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పథకం ద్వారా రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వరినాట్లు వేసే యంత్రాలు, కల్టివేటర్లు, రోటోవేటర్లు తదితర యంత్రాలను సబ్సిడీ ద్వారా సరఫరా చేసేవారు. దీంతో రైతులు కూలీలపై ఆధారపడకుండా యంత్రాలతో పొలం పనులు చేసుకునే వారు. యంత్రలక్ష్మి ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గేవి.

నిలిచిన పథకం

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 3,13,332 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 1,55,102 ఎకరాల్లో, కూరగాయలు, పూలు, వేరుశనగ 1,19,072 ఎకరాల్లో, మొక్కజొన్న 20,917 ఎకరాల్లో, మిగిలిన ఎకరాల్లో పలు పంటలను సాగు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా జిల్లాలో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ కూలీలు దొరికినా ఒక్కొక్కరికి రోజుకు రూ. 500 నుంచి రూ. 700 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. ఎకరా వేరుశనగ పంటలో కలుపు తీసేందుకు కూలీలకు రూ. 5వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే యంత్రాలతో అయితే రూ. 2వేలతో పనులు పూర్తి చేయవచ్చని రైతులు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై యంత్రాలు ఇస్తే భారం తగ్గుతుందని రైతులు అంటున్నారు.

యంత్రాలు అందించాలి



ఆరు ఎకరాల పొలంలో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేశా. ట్రాక్టర్ ఉన్నా వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు కొనలేక కూలీలపైనే ఆధార పడాల్సి వస్తోంది. ప్రభుత్వం సబ్సిడీపై యంత్రాలు పంపిణీ చేస్తే మేలు జరుగుతుంది.

– యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

నిధులు వస్తే అమలు చేస్తాం



యంత్రలక్ష్మి పథకం ద్వారా 2018 వరకు రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, రోటోవేటర్లు, ఇతరత్రా యంత్రాలను సబ్సిడీపై అందజేశాం. ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోయింది. పథకాన్ని పునరుద్ధరించి నిధులు మంజూరు చేస్తే సరఫరా చేస్తాం.

– గీతారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

నాటుబాంబు కలకలం

యాచారం: అటవీ ప్రాంతంలో ఓ నాటుబాంబు పేలడం కలకలం సృష్టించింది. యాచారం మండల పరిధిలోని గాండ్లగూడెంకు చెందిన కసరమోని మల్లేశ్ శుక్రవారం తనకున్న మేకలు, గొర్రెలను మేత కోసం గ్రామ సమీపంలోని పావురాలగుండ్ల అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. ఓ మేక మేత మేస్తున్న సమయంలో బండరాళ్ల మధ్యలో ఉన్న నాటుబాంబును కొరికింది. అది పేలడంతో మేక గాయపడింది. కాగా, నాటుబాంబు కలకలంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



యాచారం సమీపంలో నాటుబాంబును కొరకడంతో తీవ్రంగా గాయపడిన మేక